# ఆధునిక భారతదేశంలో ఆకలిచావుల కఠోర వాస్తవం

**71** సంవత్సరాలక్రితం బ్రిటిష్ వలసపాలన దోపిడీ నుండి 'స్వాతంత్ర్యం' పొందిన ఆధునిక దేశంగా మనదేశం పరిగణించబడుతోంది. మనదేశ ఆర్థికవ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతోందని, జిడిపి అంకెలను సగర్వంగా చూపుతూ ఫ్రాన్స్‌కంటే మనదేశం ముందు వుందని మన పాలకులు ఊదర గొడుతున్నారు. సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థ అయిన ప్రపంచబ్యాంకు–మనదేశంలో సులభతర వాణిజ్యం చేసుకోవటానికి కార్పొరేటు ప్రపంచానికి మనదేశం ఎంతో మంచి వాతావరణం కల్పించినందుకుగాను మన పాలకులకు అత్యుత్తమ అవార్డులను అందజేస్తున్నది.

ఈ 71 సం॥లుగా నెహ్రూ నుండి నేటి మోడీ దాకా దేశంలో పేదరిక నిర్మూలన గురించి అదేపనిగా మాట్లాడుతూనే వున్నారు; అందుకొరకు ఎన్నో పథకాలను రూపొందించారు. 'గరీబీ హటావో', 'ఆమ్ ఆద్మీ' 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం' వంటివన్నీ ఈ కోవలోవే. ఈ పథకాలన్నీ పేదరికాన్ని నిర్మూలించి పేదలను ఉద్ధరించటమే లక్ష్యంగా ప్రకటించినవే. పేదప్రజల ఇంటి ముంగిటికే సామాజిక సంక్షేమ పథకాలన్నింటినీ చేరవేయటానికి తోడ్పడేదనే పేరిట గొప్ప సాంకేతిక ఎలక్ట్రానిక్ ముందడుగుగా పేర్కొనే 'ఆధార్' నమోదు ప్రక్రియ ప్రయత్నాలనూ చూశాం. ఆహారభద్రతా చట్టంగా చెప్పబడేది చాలా ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రారంభించి విస్తృత ప్రచారం కూడా కల్పించారనే అంశం మనం మరిచిపోకూడదు. అలాగే భారత దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి 27.5 కోట్ల టన్నులకు చేరిందని, ప్రపంచ ఆర్థిక వేదిక అంచనా ప్రకారం మనదేశ ప్రజలందరికీ 23 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు సరిపోతాయని పేర్కొన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.

అయితే, పాలకుల ఈ గంభీర ప్రకటనలు, వాగ్దానాలు, ప్రచారార్భాటాలు ఏవీ సామాన్య ప్రజలకు సహాయం చేసేందుకు తోడ్పడవనేది స్పష్టం. ప్రత్యేకించి దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి జీవితాలన్నీ చేదైన అనుభవాలే. "వివాద రహితమైన" అధికారిక గణాంకాలు కోట్లాదిమంది దారిద్ర్యరేఖ దిగువనుండి పైకెదిగారని చెబుతున్నప్పటికీ, ప్రజలకు అది ఏమీ సాంత్వన కలిగించటంలేదు. వారంతా పోషకాహార లోపంతో, ఆకలితో నిరంతర జీవన పోరాటం చేస్తూనే వున్నారు. జిడిపి గణాంకాలు – ప్రజల నిజజీవన దుర్భర పరిస్థితులను గురించి చెప్పవు; సులభతర వాణిజ్యంలో సాధించిన గొప్పఘనత – పేదప్రజలు ఏనాటికైనా అభివృద్ధి చెందగలరా, చెందరా అనే అంశాలను చెప్పటంలేదు.

గత సంవత్సరం విడుదల చేసిన ప్రపంచ ఆకలి సూచీ ప్రపంచంలోని 119 దేశాల జాబితాలో మనదేశాన్ని నూరవ స్థానంలో నిలిపింది. మనదేశం పరిస్థితి మన పొరుగునున్న అభివృద్ధిచెందని బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, నేపాల్‌లకంటే ఘోరంగా వుంది.

ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచీ ప్రకారం, 188 దేశాల జాబితాలో మనం గతంకంటే ఒక అడుగు దిగజారి 131వ స్థానంలో నిలిచాము.

అయితే మన పాలకులు మాత్రం నిరంతరాయంగా మనదేశ పేదప్రజల స్థితిగతులు అభివృద్ధిచెందుతున్నాయని చెబుతూ, ప్రజానీకాన్ని నమ్మించే ప్రయత్నం ఎడతెగకుండా చేస్తూనే వున్నారు. అంతేగాక మనదేశం 'అగ్రరాజ్యం' స్థాయికి పురోగమిస్తోందని భ్రమలు కల్పిస్తున్నారు. ఈ రకమైన తప్పుడు ప్రచారంతో వారు ఎన్నికల క్రీడలాడుతూ ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకొని దేశంలో ప్రజల యోగక్షేమాలను గాలికొదిలేస్తున్నారు.

ఏమైనా, ఇటీవలికాలంలో దేశ రాజధాని ఢిల్లీ నగరంలోనే ముగ్గురి పిల్లల భయానక ఆకలిచావులు, జార్ఖండ్ రాష్ట్రం–రాయఘడ్‌కు సమీపంలో జరిగిన ఆకలిచావుల వార్తలు–పాలకులు విస్తృత ప్రచారం చేస్తున్న ప్రజల సంక్షేమం గురించిన అపోహలను పటాపంచలు చేసి, దేశం సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి. వాస్తవానికి ఇలాంటి సంఘటనలు భారతదేశంలో అసాధారణమూ కాదు; లేదా అరుదుగా మాత్రమే జరగటంలేదు. భారతదేశంలో ఆకలిచావులు నిత్యకృత్యమయ్యాయని అనేక ప్రభుత్వేతర స్వచ్ఛందసంస్థలు గణాంకాలతో తెలియ జేస్తున్నాయి. వీటిలో అత్యధిక భాగం గిరిజన ప్రాంతాలలోనూ, గ్రామీణ భారతంలోనూ జరుగుతూ పత్రికా, ప్రసారమాధ్యమాలలోకి ఎక్కటంలేదనే అంశాన్ని విస్మరించజాలము.

అందరికీ 'ఆధార్ కార్డు' లభించిన తర్వాత కూడా, ఆకలితో మరణిస్తున్న పేదలు రేషన్ కార్డు పొందటానికో లేదా దానిద్వారా లభించే కొన్ని సదుపాయాలను పొందటానికో ఇంకా అనర్హులుగానే వున్నారనే కఠోర వాస్తవాన్ని పైన పేర్కొన్న ఆకలి చావులు తేటతెల్లం చేస్తున్నాయి.

అయితే అవేవీ ఆకలిచావులు కావని యధావిధిగా మన అధికార యంత్రాంగం కరాఖండిగా ప్రకటిస్తోంది. అయితే ఈ చావులు అనారోగ్య కారణంగా సంభవించాయని చెబుతున్నారు. కాగా, ఢిల్లీలో మరణించిన ఆ పిల్లల మృతశరీరాలను పోస్టుమార్టమ్ చేయగా, ఆహారం తీసుకున్న దాఖలాలు లేవని విదితమౌతోంది.

ఇలాంటి ఘటనలు నిరాటంకంగా సాగిపోవటమేగాక, వాటిని కుంటిసాకులతో నిరాకరిస్తూ, తిరిగి ఇలాంటి ఘటనలు జరిగేందుకు బాటలు వేస్తోన్న ఈ పరిస్థితులపట్ల, ఈ విషాద పరిస్థితులపట్ల దేశం తలదించుకోవాలి.

ఆకలిచావులనేవి కొద్ది ప్రాంతానికో, కొన్ని కుటుంబాలకో పరిమితమైలేదు. "భారతదేశ అసంఘటిత రంగంలోని కార్మికులంతా కనీసపాటి మద్దతు లేక ఆర్థిక సమస్యలను తీవ్రంగా ఎదుర్కొంటున్నా"రని రైట్ టు ఫుడ్ క్యాంపైన్, సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ ఈ ఆకలిచావులపై ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ బృందంలో సభ్యులైన గీతాంజలీ కృష్ణ సరిగ్గా అభిప్రాయపడ్డారు.

ఆహారం లేకపోవటం, అందులోనూ సరైన పోషక విలువలు గల ఆహారం అందుబాటులో లేకపోవటం శరీరాన్ని క్రమంగా శుష్కింపచేస్తుంది. శరీరంలో రోగనిరోధకశక్తి సన్నగిల్లటంతో, అనేక వ్యాధులు సులభంగా సంక్రమించే దానికి అవకాశం ఏర్పడుతుంది. కావున అనేక వ్యాధుల బారినపడి చనిపోయినట్లుగా రికార్డులలో నమోదు చేస్తున్న అనేక చావులన్నీ సారాంశంలో ఆకలిచావులుగానే వున్నాయనేది వాస్తవం.

సామ్రాజ్యవాదం పనుపున నయాఉదారవాద ఆర్థిక విధానాలను అవలంబిస్తున్న మనదేశంలో వ్యవసాయరంగాన్ని కోలుకోలేని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశారు. ఫలితంగా రైతాంగ, గ్రామీణ పేదల దుస్థితి వర్ణనాతీతంగా వుంది. పూటగడవక, పొట్ట చేతబట్టుకొని ప్రవాహంలా పట్టణాలకు వలసలు వెళ్తున్నారు. వీరంతా ఎలాంటి సామాజిక, ఉపాధి భద్రతాలేని అసంఘటితరంగంలోనూ, ప్రమాదకర పరిశ్రమలలోనూ కారుచౌక కూలీలుగా నికృష్ట దోపిడీకి గురవుతున్నారు. లభించే అరాకొరా వేతనాలతో అభద్రతతో కూడిన మురికి కూపాలలో అర్థాకలితో వారంతా కునారిల్లిపోతున్నారు. వారిని ఉద్ధరించటంకోసమే ఎన్నికయ్యామని చెప్తోన్న ఏ ప్రభుత్వాలూ వీరిని ఈ స్థితినుండి బయట పడేయడానికి ముందుకు రావు. ఇదీ మనదేశంలో ఆకలిచావుల గురించిన కఠోర వాస్తవం!

ooooo